క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ పరిశీలకుడు చల్లాకు ఘన సత్కారం



మండపేటలో చల్లా ప్రభాకరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ మండపేట నియోకవర్గ పరిశీలకుడు, పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి, ఆలమూరుకు చెందిన డాక్టర్ చల్లా ప్రభాకరరావును గురువారం రాత్రి మండపేటలో నియోజకవర్గ నేతలు ఘనంగా సత్కరించారు. స్థానిక సూర్య కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రభాకరరావును ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి సత్కరించారు. ప్రభాకరరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా, సమన్వయంతో కృషి చేయాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, ఎమ్మెల్సీ తోట నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు పార్టీ విజయానికి దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, రూరల్ మండలాల కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మీడియా పాత్రపై నేడు సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో మీడియా పాత్రపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించనున్నట్టు మండపేట అసెంబ్లీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలోని మండపేట అర్బన్, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లోని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రక్రియ, నిర్వహణ, నియమ నిబంధనలు, మీడియా పాత్ర తదితర అంశాలపై అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బీవీఎస్ ఎల్లారావు అవగాహన కల్పిస్తారని ఎం.సురేష్‌కుమార్ తెలిపారు.


వాసవీ క్లబ్ జోన్ చైర్మన్‌కు సత్కారం



సురేష్‌కుమార్, సత్యనారాయణను సత్కరిస్తున్న స్థానిక నేతలు, సభ్యులు

రాయవరం: వాసవీ క్లబ్ జోన్-1 చైర్మన్ కుంచం సత్యనారాయణను వాసవీ మైత్రి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇక్కడ ఘనంగా సత్కరించారు. స్థానిక పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయం వద్ద వాసవీ మైత్రి క్లబ్ చైర్మన్ గ్రంధి మురళి, సెక్రటరీ బొడ్డు గంగాభవాని, కోశాధికారి బొడ్డు సూర్యకుమారి ఆయనను సత్కరించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని వాసవీ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ చెక్కా సురేష్‌కుమార్, వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అనంతరం వాసవీ మైత్రి క్లబ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ గొలుగూరి వరలక్ష్మిని మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్కరించారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి, స్థానిక నేతలు పులగం శ్రీనివాసరెడ్డి(పీఏసీఎస్), సత్తి వెంకటసుబ్బారెడ్డి, వాసవీ మైత్రి క్లబ్ సభ్యులు కాళ్లకూరి సుజాత, బొడ్డు జ్యోతి, మన్యం లక్ష్మి, రాఘవ లక్ష్మి, బొడ్డు వాసవీ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు మార్కింగ్



కోరుమిల్లిలో శ్మశాన వాటిక మార్కింగ్‌ను పరిశీలిస్తున్న జేఈ రాఘవులు

కపిలేశ్వరపురం: కోరుమిల్లి పుష్కర ఘాట్ సమీపంలో శ్మశాన వాటిక నిర్మాణానికి మార్కింగ్‌ను పంచాయతీరాజ్ జేఈ డీవీ రాఘవులు శుక్రవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకుల సమక్షంలో శ్మశాన వాటిక నిర్మాణంపై చర్చించారు. గోదావరి నది ఉధృతి, కర్మకాండల నిర్వహణ, సదుపాయాలు తదితర వాటి ఆధారంగా మార్కింగ్ ఇచ్చారు. జేఈ రాఘవులు, మాజీ సర్పంచ్ సలాది వీరబాబు మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో శ్మశాన వాటిక నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి సాయం

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు గొల్లగుంటలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న గుబ్బల బాలాజీరావుకు రెడ్ క్రాస్ జీవిత కాలం సభ్యులు సాయాన్ని శుక్రవారం పంపిణీ చేశారు. బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెడ్ క్రాస్ జీవిత కాల సభ్యులు బెహరా వీర హనుమంతరావు, స్థానికుడు లక్కింశెట్టి భాస్కరరావు సమకూర్చిన నిత్యవసరాలు, బియ్యం, కిరాణా సరకులను సర్పంచ్ జల్లి బాలరాజు చేతుల మీదుగా అందజేశారు.



సోమేశ్వరంలో సోమేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పురోహితుడు



పడమర ఖండ్రికలో బారులు తీరిన భక్తజనం



మండపేట మండలం ఏడిద సంగమేశ్వరస్వామి ఆలయంలో దర్శించుకుంటున్న భక్తులు



ఉయ్యాల జంపాల దైవ క్షేత్రంలో వైద్యసేవలను పరిశీలిస్తున్న వైద్యాధికారి రత్నకుమారి

ముక్కంటికి ప్రణమిల్లి

- శివ నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- అభిషేకాలు, పూజలతో మురిసిన శివయ్య
- స్వామిని దర్శించుకున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ తోట

రాయవరం: హరహర మహాదేవ.శంభోశంకర.. ఓం నమఃశ్శివాయ అంటూ శివ నామస్మరణ ముక్కంటి ఆలయాల్లో మిన్నంటింది. సకల పాపాలను హరించి, కరుణ కురిపించే భక్త సులభుడు.. ఆది మధ్యాంత రహితుడైన పరమశివుడ్ని దర్శించుకునేందుకు శుక్రవారం వేకువజామున నాలుగు గంటల నుంచే భక్తులు ఆలయాల్లో బారులు తీరారు. పంచాక్షరి మంత్రాన్ని జపించి, శివుని అర్చించి, అభిషేకంతో పూజించి, నామస్మరణతో జాగారం చేసి తరించేందుకు భక్తజనం తహతహలాడారు.

ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని చారిత్రక శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చారిత్రక శివాలయాలైన సోమేశ్వరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి ఆలయాన్ని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వేకువమజామున నాలుగు గంటల నుంచి భక్తుల తాకిడి ప్రారంభమైంది. ఎస్సై జి.సరేష్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. వెంటూరులోని ఉమా సోమేశ్వరస్వామి, చెల్లూరులోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి, రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి, మాచవరంలోని శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు శివుడ్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. మధ్యాహ్నం 12 గంటల వరకు పలుచోట్ల భక్తులు బారులు తీరడం కన్పించింది. మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆలయాల్లో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మారేడు దళాలతో లక్షపత్రి పూజలను నిర్వహించారు. శివలింగాలకు పలుచోట్ల పంచద్రవ్యాలతో అభిషేకం చేశారు. రాత్రి సమయంలో ఆలయం వద్ద భక్తులు దీపాలను వెలిగించారు. రాత్రి 11 గంటల నుంచి లింగోద్భవ పూజలు చేపట్టారు. సోమేశ్వరం శివాలయంలో వర్తక సంఘం ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నదానం నిర్వహించారు. భక్తులు రాత్రి సమయంలో జాగారం చేసేందుకు అనువుగా పలు ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దేవాలయాలను విద్యుద్దీపాంకరణతో పాటు, భారీగా బాణసంచా కాల్చారు. రాయవరంలో పార్వతీ సమేత రాజేశ్వర స్వామి ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పులగం శ్రీనివాసరెడ్డి, వ్యాపారవేత్త మల్లిడి సుబ్బారెడ్డి సౌజన్యంతో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



పడమర ఖండ్రికలోని త్ర్యంబకేశ్వర స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ పతివాడ



పడమర ఖండ్రికలోని త్ర్యంబకేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎంపీ అనురాధ

సందడిగా శైవ క్షేత్రాలు

కపిలేశ్వరపురం: మండలంలోని శైవ క్షేత్రాలు శుక్రవారం సందడిగా మారాయి. భక్తులు గోదావరి, కాలువ రేవుల్లో పుణ్య స్నానాలను ఆచరించారు. పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి శివపార్వతులకు అభిషేకాలు చేశారు. కోరుమిల్లిలో కొలువైన రాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి దర్శనార్థం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. పడమర ఖండ్రికలోని త్ర్యంబకేశ్వరస్వామిని ఎంపీ చింతా అనూరాధ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండల సాగు సలహా కమిటీ చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, నాయకులు నక్కా సింహాచలం దర్శించుకున్నారు. వారిని సర్పంచ్‌లు తిరునాతి ఆదిలక్ష్మి, వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీలు పెద్దిరెడ్డి శేషారత్నం, అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు ఘనంగా సత్కరించారు. కపిలేశ్వరపురంలోని అగస్తేశ్వర, పాపవినాసేశ్వర, అంగరలోని సుబ్రహ్మణ్యేశ్వర, ఖణ్వలింగేశ్వరస్వామి, తాతపూడిలోని మల్లేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి, వాకతిప్ప గ్రామాల్లో గౌతమి నది పుష్కరఘాట్లు, వెదురుమూడి, నల్లూరు, కాలేరు, అచ్యుతాపురం గ్రామాల భక్తులు కోరంగి కెనాల్ రేవుల్లోనూ, అంగర, పడమర ఖండ్రి, టేకి, మాచర గ్రామాల్లోని రేవుల్లో పంచాయతీ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది సేవలందించారు. ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షించారు.

జ్యోతిర్లింగాల ప్రదర్శన



పసలపూడి ఓంశాంతి ఆశ్రమంలో ప్రదర్శించిన జ్యోతిర్లింగాలు

రాయవరం: పసలపూడిలోని బ్రహ్మకుమారీ ఆశ్రమంలో శుక్రవారం మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో బ్రహ్మకుమారీలు ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రదర్శించారు. బ్రహ్మకుమారి మాధవి మాట్లాడుతూ నిరాకారుడైన భగవంతుడు మహా శివ రాత్రి రోజు ముందుకు వస్తాడన్నారు. భగవంతుని ధ్యానించడం వల్ల మనశ్శాంతి లభిస్తుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు.

మండపేట మండలంలో..

ఏడిద సంగమేశ్వరాలయం, కేశవరంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, ద్వారపూడి అయ్యప్ప స్వామి, మండపేట అర్బన్‌లోని అగస్త్యేశ్వరస్వామి, సీతారామక్షేత్రం, అయ్యప్పస్వామి, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండపేట పట్టణం, రూరల్ గ్రామాల్లో పెద్దకాలువ రేవులు, మెహర్ ఆశ్రమం, పాలతోడు శివాలయం వద్ద రేవు, వెలగతోడు-తాపేశ్వరం రహదారిలోని దోనె రేవు, మేడపాడు దుర్గాదేవి, ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయాల వద్ద, పేకేటిపాకలు రేవుల్లో భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. మున్సిపల్ కమిషనర్ బి.రాము, ఈఓ పీఆర్డీ ఐదం రాజు, కార్యదర్శులు పర్యవేక్షించారు. కేశవరంలోని వీరభద్రస్వామిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దూలం పద్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, అన్నందేవుల చంద్రరావు, తుపాకుల ప్రసన్నకుమార్, అబ్బిరెడ్డి వీర్రాజు దర్శించుకున్నారు.

హరహర మహాదేవ...

రామచంద్రపురం రూరల్: ప్రణవ పంచాక్షరి మంత్రం «ఓం నమశ్శివాయ» స్మరణతో రామచంద్రపురం నియోజకవర్గంలోని శివాలయాలు ప్రతిధ్వనించాయి. పరమ శివునికి అత్యంత ప్రీతికరమైన శివరాత్రిని భక్తులు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పుణ్యగోదావరి నదిలో స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక అభిషేకాలు చేశారు. లింగోద్భవ సమయం వరకూ ఉపవాసంతో ఈశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి పర్వదినాన శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించారు.

రామచంద్రపురం మండలంలో...

మహాశివరాత్రి పర్వదినాన రామచంద్రపురంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వెల్ల, కుందాలమ్మచెరువు, ఏరుపల్లి, నరసాపురపుపేట, ఓదూరు, యనమదల, హసన్‌బాద తదితర గ్రామాల్లోని శివాలయాల్లో, ఆదివారపుపేట శివబాలయోగి మహరాజ్ ఆశ్రమంలోను, ద్రాక్షారామ ఓంశాంతి ఆశ్రమంలోను భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ఘంటాంబికా అమ్మవారి ఆలయం వద్ద...

దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి దేవాలయానికి దక్షిణాన ఉన్న దక్షగుండం వద్ద శ్రీఘంటాంబికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చేసిన ఏర్పాట్లు కళ్లు మిరుమిట్లు గొలిపేలా ఉండి విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా అఖండ దీపారాధనతో పాటు, భారీ శివలింగం ఆకృతిలో ఏర్పాటు చేసిన అఖండ దీపారాధన భక్తులను కట్టిపడేసింది. కోనేరు నిండా పూలు, దేవాలయం చుట్టూ కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణ మధ్య అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉద్విగ్నతకు గురయ్యారు.

బియ్యంపేటలో అఖండ దీపారాధన..

ద్రాక్షారామలోని బియ్యంపేట కోదండ రామాలయం వద్ద ద్రాక్షారామ భీమేశ్వరస్వామి వలే ఎత్తైన శివలింగం, త్రిశూలం, ఓంకారం ఆకారాలలో మహిళలు దీపాలను ఏర్పాటు చేసి అఖండ దీపారాధన నిర్వహించారు. వార్డు సభ్యురాలు పిల్లి సుహాసిని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఆలయ కమిటీ పెద్దలు వాసంశెట్టి శంకరరావు, వాసంశెట్టి చిన్ని, బాలం గణేశ్వరరావు, రెడ్డి గంగరాజు, వాసంశెట్టి బాపూజీ, వాసంశెట్టి శ్రీను, రెడ్డి సీతారామ్, చింతపల్లి వెంకటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి అఖండ దీపారాధన నిర్వహించారు. విఠల్ మాస్టారు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



కాజులూరులో భక్తుల దర్శనార్థం బ్రహ్మకుమారీస్ ప్రతిష్ఠించిన ద్వాదశ జ్యోతిర్లింగాలు

భీమేశ్వరుని సన్నిధిలో మంత్రి వేణు

ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజామునుంచి సప్తగోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. 33 మట్టి కుండలతో అభిషేక ద్రవ్యాలు, సప్త నదుల జలాలు, 12 గుండాల నుంచి సేకరించిన జలాలతో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కుటుంబ సమేతంగా స్వామికి తొలి అభిషేకం నిర్వహించారు. రుత్వికులు, వేదపండితులు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టెంట్లలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ఈఓ పి.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

జనసంద్రంగా మారిన కోటిపల్లి

కె.గంగవరం: హర హర శివశంభో అంటూ ఆలయాలు శివన్నామ స్మరణతో మార్మోగాయి. మండలంలోని పుణ్యక్షేత్రం కోటిపల్లిలో కొలువైన చాయా సోమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి గౌతమి గోదావరి నది వద్ద పుణ్యస్నానం ఆచరించేందుకు భక్తులు పోటీపడ్డారు. ఆలయ అర్చకులు గోదావరి నుంచి తీర్థబిందెతో స్వామికి అభిషేకం నిర్వహించిన అనంతరం దర్శనానికి అనుమతి ఇచ్చారు. పుణ్యస్నానం ఆచరించిన భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలో గంటలతరబడి వేచిఉన్నారు. సుమారు 400 మంది పోలీసులతో భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.20 దర్శనాలు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది క్యూలో ఉన్న భక్తులకు సేవలు అందించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సుమారు లక్ష మందికి పైగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

మహాశివ రాత్రి సందర్భంగా స్వామిని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ దంపతులు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు, రామచంద్రపురం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ దంపతులు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామిని దర్శించుకున్నారు. రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్, ఎంపీపీ పంపన నాగమణి, సుబ్బారావు దంపతులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు. ఈ ఏడాది ఆలయంలో పాటు స్వామికి అమ్మవారికి, మండపాలకు, ద్వారాలకు చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ఈఓ జెఎం.శ్రీదేవి నేతృత్వంలో ప్రత్యేక పూల అలంకరణ చేశారు. స్వామిని దర్శించుకునేందుకు కోటిపల్లి గ్రామానికి విచ్చిన భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు ఆతిథ్యం ఇచ్చారు. కె.గంగవరం నుంచి కోటిపల్లి వరకు దారి పొడవునా పలువురు దాతలు పులిహోరం, మజ్జిగ పంపిణీ చేశారు.

వైభవంగా అఖండ దీపారాధన

మండలంలోని కోటిపల్లిలో కొలువైన శ్రీఛాయా సోమేశ్వర స్వామివారి ఆలయం వద్ద చాగంటి వంశీయులు అఖండ దీపారాధనను వైభవంగా నిర్వహించారు. ఏటా శివరాత్రి పర్వదినాన్ని ఉదయం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు చాగంటి వంశీయులు గత పది తరాలుగా అఖండ దీపారాధన చేస్తారు. ఈ ఏడాది కూడా రామచంద్రపురానికి చెందిన చాగంటి పట్టాభిరామ వరప్రసాద్ ఇతర కుటుంబ సభ్యులు అఖండ దీపారాధన చేశారు. వారు మాట్లాడుతూ పూర్వీకుల నుంచి ఈ సంప్రదాయం అలవాటుగా వస్తుందని తెలిపారు.




ద్రాక్షారామ బియ్యంపేట కోదండ రామాలయం వద్ద నిర్వహిస్తున్న అఖండ దీపారాధన

భక్తిశ్రద్ధలతో కోటి దీపారాధన

కోటి దీపారాధన మహోత్సవం భక్తులకు కనులపండువగా సాగింది. శంభో.. శివ శంభో అంటూ భక్తులు దీపారాధన మహోత్సవాన్ని తిలకించి పరవశించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి కోటిపల్లిలోని ఛాయా సోమేశ్వర స్వామి ఆలయ మండపంపై ఉత్సవ కమిటీ చైర్మన్, రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్, రామచంద్రపురం వైఎస్సార్ సీపీ కోర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి కోటి దీపారాధన మహోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయంలో ప్రాంగణంలో తొలుత స్వామివారి ఉత్సవ విగ్రహాలకు విశేషపూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు, భక్తులు ఆలయ కమిటీ సభ్యులు అధికారుల సమక్షంలో దీపారాధనను ప్రారంభించారు. ఆలయంలో దీపాలు వెలిగించేందుకు భక్తులు పోటీ పడ్డారు. విశేషంగా భక్త జనసందోహం ఆలయం వద్దకు చేరుకుని దీపారాధన మహోత్సవాన్ని చూసి తరించారు. అమలాపురం, రామచంద్రపురం, ద్రాక్షారామ పరిసర ప్రాంత ప్రజలు ఆలయం వద్దకు చేరుకుని దీపాలను చూసేందుకు పోటీ పడ్డారు. ట్రస్టీబోర్డు చైర్మన్ పిల్లి శ్రీను, ఆలయ ఈఓ శ్రీదేవి, దేవదాయ ధర్మదాయ శాఖ తనిఖీదారు రామలింగేశ్వరావు, దీపారాధన మహోత్సవంలో పాల్గొన్నారు.

ఘనంగా శివ జయంతి

కాజులూరు: మండల కేంద్రమైన కాజులూరులో శుక్రవారం స్థానిక బ్రహ్మకుమారీస్ సభ్యులు శివ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కాకినాడ బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వాహకులు బీకే రజనీదీదీ ఆధ్వర్యంలో గ్రామంలోని శివాలయం ఆవరణలో శిబిరాలను ఏర్పాటు చేసి ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రతిష్ఠించారు. శివరాత్రి పురస్కరించుకుని పరిసర గ్రామాల నుంచి ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు ప్రత్యేక శిబిరంలో ప్రతిష్ఠించిన శివలింగాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. చిత్రపటాల ద్వారా బ్రహ్మకుమారీస్ సంస్థ విధి విధానాలను సభ్యులు భక్తులకు వివరించారు. కాజులూరు బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వాహకులు బీకే రామలక్ష్మి మాట్లాడుతూ ఆత్మే పరమాత్మ అని మనిషి కామ, క్రోధ, మద వాత్సల్యాలను, విష వికారాలను జయించి ఆత్మను పవిత్రంగా ఉంచుకోగలిగితే భగవంతుని సాన్నిత్యాన్ని పొందగలుగుతారన్నారు. భగవంతునికి రూపం లేదని అందుకే శివపరమాత్మ లింగాకారంగాను జ్యోతి స్వరూపుడుగాను దర్శనమిస్తున్నాడన్నారు. గత 30 ఏళ్లుగా శివజయంతి పురస్కరించుకుని దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాలకు చెందిన శివలింగాలను శివరాత్రి రోజున గ్రామంలోని భక్తుల దర్శనార్థం ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన బ్రహ్మకుమారీస్ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



దక్షగుండం ఘంటాంబికా అమ్మవారి ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణ మధ్య భక్తుల దర్శనం



కోటిపల్లి ఆలయంలో స్వామివారిని దర్శించుకోవడానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



కోటిపల్లి ఆలయం వద్ద కనుల పండువగా వెలిగించిన దీపాలు



అఖండ దీపారాధన చేస్తున్న చాగంటి వంశీయులు

అతివకు ఆకాశమే హద్దు

కపిలేశ్వరపురం: ఆకాశంలో సగమున్న అతివ సామర్థ్యానికి ఆకాశమే హద్దు అని శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలన్నారు. అంగర పీహెచ్‌సీలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ) కపిలేశ్వరపురం మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ పి.రత్నకుమారి, హెచ్‌వీ తాతపూడి మేరీమణి, స్టాఫ్ నర్సు బంగారు పాప, మహిళా వైద్యారోగ్య కార్యకర్తలను సత్కరించారు. ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునరావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వైద్యారోగ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సేవలను కొనియాడారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు మాట్లాడుతూ సామాన్యుల ప్రాణ రక్షణలో మహిళా వైద్యుల సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సూరంపూడి వీరభద్రరావు, సూరంపూడి సత్యనారాయణ, తోరం రాము, పోలినాటి రాఘవమ్మ, జెస్సీ సంకాబత్తుల నాగేంద్ర పాల్గొన్నారు. కపిలేశ్వరపురం, తాతపూడి, అంగర, పడమర ఖండ్రిక, వల్లూరు, వెదురుమూడి, నేలటూరు, నిడసనమెట్ట, అచ్యుతాపురం, వడ్లమూరు, కాలేరు, నల్లూరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువులు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో మహిళా ఉద్యోగులను ఆయా సచివాలయాల సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు.



అంగర పీహెచ్‌సీలో మహిళా వైద్యాధికారి, సిబ్బందిని సత్కరిస్తున్న పీఎంపీ నాయకులు

మండపేట పట్టణం, మండపేట రూరల్ మండలంలోని 12 గ్రామాల్లో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏడిద, వేములపల్లి, మెర్నిపాడు, మారేడుబాక, తాపేశ్వరం, ద్వారపూడి, జెడ్.మేడపాడు, వెలగతోడు, పాలతోడు, అర్తమూరు, ఇప్పనపాడు, కేశవరం గ్రామాల సచివాలయాల్లో గ్రామ సభలను నిర్వహించారు. మహిళా అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు.

భారత్ ప్రపంచానికే ఆదర్శం

కాజులూరు: ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని ఈ విధానంలో భారతదేశం ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచిందని గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, గ్రామ ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి అన్నారు. శుక్రవారం ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని గ్రామంలో క్లబ్ సభ్యులు నిర్వహించిన కార్యక్రమంలో భువనేశ్వరిదేవి పాల్గొని పలువురు పేద మహిళలకు చెప్పులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ నేటి ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యం కల్పిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు పురుషులతో పాటు సమానంగా ముందడుగులు వేయాలన్నారు. అలయన్స్ క్లబ్‌లోని పలువురు మహిళా సభ్యులను శాలువాలతో సత్కరించారు. క్లబ్ సభ్యులు నల్లమిల్లి విజయలక్ష్మి, ఎస్.భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.